ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - కడప

ఈ నెల 14న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు జిల్లా కేంద్రానికి రాకుండానే Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ అర్జీలు నమోదు చేసుకోవచ్చును అని తెలిపారు. నమోదైన అర్జీల స్థితికి సంబంధించి సమాచారాన్ని 1100కి నేరుగా కాల్ చేసి తెలుసుకోవచ్చు అని తెలిపారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించగలరన్నారు.

చేదెక్కిన చీనీ

ధరలు పతనం
వేధిస్తున్న తెగుళ్లు
ఎండుతున్న చెట్లు
ఆందోళనలో రైతన్నలు

మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న చీనీ కాయలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

నియోజవర్గంలో చీనీ సాగు కష్టతరంగా మారిందని రైతులు వాపోతున్నారు. వైఎస్ఆర్ కడప జిల్లాలోని చీనీ కాయలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి చీనీ కాయల సాగు చేసే రైతుల పరిస్థితి నేడు దయనీయంగా మారిపోయింది. మూడు సంవత్సరాల నుంచి చీనీ చెట్లు విపరీతమైన తెగులు కారణంగా ఎండిపోతున్నాయి. మరోవైపు వీటిని కాపాడుకోవడానికి విపరీతమైన పెట్టుబడి పెట్టి ఆమేరకు దిగుబడులు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా నియోజవర్గంలోని సింహాద్రిపురం, తొండూరు, పులివెందుల, లింగాల, వేముల మండలాలలో దాదాపు 22 వేల ఎకరాల్లో చీనీ పంట సాగులో ఉంది.

పెరగని చీనీ ధరలు

ప్రస్తుత కోత దశలో ఉన్న చీనీ కాయలకు ధరలు ఏమాత్రం పెరగకపోవడంతో రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో ధరలు టన్ను కాయలు రూ.40 నుంచి 50 వేలు వరకు పలికాయి. అలాంటిది ప్రస్తుతం టన్ను రూ 20 నుంచి రూ. 25 వేలు మాత్రమే ఉంది. దీనికి తోడు ఈ ఏడాది వాతావరణంలో మార్పులు కారణంగా కాయలు ఎక్కువ భాగం మంగు రావడంతో ధరలు మరింత తగ్గించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

తెగుల్లతో ఎండిపోతున్నచెట్లు...

మూడు సంవత్సరాల నుంచి చీనీ చెట్లకు విపరీతమైన తెగుళ్ల వ్యాపించడంతో వాటి నివారణ కొరకు వేల రూపాయల ఖర్చు పెట్టినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా వేరు కుళ్ళు, పులుసు పురుగు తెగులు కారణంగా చెట్లు నిట్ట నిలువునా ఎండిపోతున్నాయి. చీనీ కాయలకు నల్లి ఆశించడంతో కాయల ు(మంగు) నల్లగా మారిపోతున్నాయి.

తోటలు తొలగింపు..

చీనీ సాగులో నష్టాలు వస్తుండడంతో రైతులు తోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ముగ్గు చూపుతున్నారు. దశాబ్దకాల కిందట కడప జిల్లాలోని సింహాద్రిపురం మండలంలో చీనీ సాగు ప్రధానంగా ఉండేది. సాగు భారం కావడంతో చాలామంది రైతులు వాటిని తొలగించి అరటి, మొక్కజొన్నతో పాటు ఇతర ప్రత్యాయ పంటల సాగుకు ఉపక్రమించారు. కొత్తగా చీనీ తోటల ఏర్పాటుకు రైతులు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. గతంలో రైతులే చీని మొక్కల నర్సరీల సైతం ఏర్పాటు చేసి కర్ణాటక, తెలంగాణ ప్రాంతానికి విపరీతంగా సరఫరా చేసేవారు. ప్రస్తుతం నర్సరీలు సైతం కనుమరుగయ్యాయి.

ప్రభుత్వం నుంచి ఆదరణ కరువు

ప్రభుత్వం నుంచి చీనీ సాగుకు ఆదరణ కరువైందని రైతులు చెబుతున్నారు. గతంలో పాత తోటల పునరుద్ధరణ పథకం కింద రైతులకు ప్రోత్సాహం ఉండేది. ప్రస్తుతం వాటికి ప్రభుత్వం మంగళం పాడడంతో పాటు చీనీ చెట్లు చనిపోతున్న వాటికి ఇన్సూరెన్స్ రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం..

ఆరుగాలం శ్రమించి పంట దిగుబడులు వచ్చే సమయంలో ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వమే కనీస మద్దతు ధరగా టన్ను చీనీ కాయలు రూ 40 వేలతో కొనుగోలు చేయాలి. ప్రస్తుతం కూలీలు, పురుగుమందులు, ఎరువుల ధరలు భారీగా పెరిగాయి. కాయలకు మాత్రం ధరలు ఆ విధంగా పెరగకపోవడంతో నష్టపోతున్నాం.

-వెంకట్రామిరెడ్డి, చీనీ రైతు, సింహాద్రిపురం.

రాయితీతో ఎరువులు అందజేయాలి..

ప్రభుత్వం రాయితీతో పురుగుమందులు, ఎరువులు అందజేయాలి. ప్రస్తుతం చీని సాగు కష్టంగా మారింది. లెక్కకులేనన్నిసార్లు పురుగు మందులు పిచికారి చేసినప్పటికీ ప్రయోజనం మాత్రం కనిపించడం లేదు. నకిలీ పురుగుమందులు పిచికారి చేస్తున్నామా లేక వాతావరణంలో మార్పులు కారణంగా ఈ తెగులు వస్తున్నాయా అర్థం కావడం లేదు. దీని నివారణకు నాణ్యమైన పురుగుమందులను ప్రభుత్వమే రాయితీతో అందజేయాలి.

- రవిశంకర్, చీనీ రైతు, గురజాల.

ధరలు తక్కువగా ఉన్న విషయం వాస్తవమే

ప్రస్తుతం మార్కెట్లో చీనీ కాయల ధరలు తక్కువగా ఉన్న విషయం వాస్తవమే. మహారాష్ట్రలో దిగుబడి పెరగడంతో ధరలు పెరగనట్లు తెలుస్తుంది. తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మరిన్ని అవగాహన సదస్సులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటా.

మల్లేశ్వర్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి, ముద్దనూరు.

తెగులు కారణంగా ఎండిపోతున్న చీనీ చెట్టు

నిరంతరాయంగా

ఎన్‌టిఆర్ వైద్య సేవలు

రూ.ఐదు లక్షలతో వృద్ధులకు ఆయుష్మాన్ సేవలు
90 వేల మందికి 'ఆయుష్మాన్ భారత్' వర్తింపు
జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.బాలాంజనేయులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

రాష్ట్ర ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలతో సంప్రదించి వైద్యసేవలను నిరంతరాయంగా కొనసాగిస్తోంది. నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి ఇబ్బందులు ఎదురైతే ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్, 104 కాల్‌సెంటర్, హెల్ప్‌డెస్క్, ఆరోగ్య మిత్రలను సంప్రదిస్తే పరిష్కారం లభి స్తుంది. రేషన్‌కార్డులు లేకపోవడం, కార్డుల్లో పేర్లు నమోదు చేయకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొనే రోగులకు సిఎంసి లెటర్ ద్వారా వైద్య సేవలకు అర్హత కల్పిస్తాం. కేంద్రంలో ఆయుష్మాన్‌భారత్, ఆయు ష్మాన్ వయో వృద్ధుల పథకంలో భాగంగా రూ. ఐదు లక్షల వరకు 70 ఏళ్లు నిండిన వృద్దులకు ఉచిత వైద్యసేవలు అందిస్తోందని ఆధార్ కార్డుతో ఇకెవైసి అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొంటున్న ఎన్‌టిఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.బాలాంజనేయులుతో ముఖాముఖి...

నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్‌వైద్యసేవలు నిలిపేయడంపై స్పందించండి?

జిల్లాలోని కొన్ని ప్రయివేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలను పూర్తిగా నిలిపేశారనే మాట అవాస్తవం. చేతి వేళ్ల మీద లెక్కపెట్టగల ఆస్పత్రుల్లో మాత్రమే నిలిపేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజ మాన్యాలతో సంప్రదింపులు జరపడంతో ఎన్టీఆర్ వైద్యసేవలను కొన సాగిస్తున్నారు.

ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఎన్ని?

జిల్లావ్యాప్తంగా ఎన్‌టిఆర్ నెట్‌వర్క్ పరిధిలో 104 హాస్పిటల్స్ ఉన్నాయి. ఇందులో ప్రయివేటు 43, పిహెచ్‌సి 53, సిహెచ్‌సి 07, ప్రభుత్వం 01, జిజిహెచ్‌లు 02, జిల్లా ఆస్పత్రి 01, ఏరియా ఆస్పత్రి 01 ఉన్నాయి.

అత్యధిక సర్జరీ కేసులేమిటి?

రాష్ట్రప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద 3,245 వ్యాధులకు చికిత్సలు అందిస్తోంది. ఉమ్మడి కడప జిల్లావ్యాప్తంగా అత్యధికంగా ఆర్థోపె డిక్, గైనకాలజీ, కార్డియాలజీ, డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా చికిత్సలు చేయించుకుంటున్నారనేది ఓ అంచనా.

కార్డులు, పేర్లు లేని రోగుల పరిస్థితేమిటి?

రేషన్‌కార్డులు లేని, పేర్లు గల్లంతైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవలు వర్తించే ప్రయత్నం చేస్తున్నాం. దీని కింద చికిత్స తీసుకోవా లనుకుంటున్న రోగులకు సిఎంసి లెటర్‌ను అందించి ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు సిఫారసు చేస్తాం.

ఆరోగ్యశ్రీ రోగులు ఫిర్యాదు చేయాలనుకుంటే ఎలా?

ఎన్‌టిఆర్ వైద్యసేవలు సక్రమంగా అందని పక్షంలో రోగులు హెల్ప్ డెస్క్, ఆరోగ్యమిత్ర, 104 కాల్‌సెంటర్లను ఆశ్రయించే సదు పాయం కల్పించాం.

ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డుదారుల వివరాలు చెప్పండి?

జిల్లాలోని 36 మండలాల పరిధిలో ఆయుష్మాన్‌భారత్, వయో వందన పథకం కింద 1,60,292 మంది వృద్ధులు ఉన్నట్లు గుర్తించాం. మరో 90 వేల మందికి ఇకెవైసి చేయడం జరుగుతోంది. జిల్లాలోని అర్హులైన వృద్ధులు ఎఎన్ఎంలను సంప్రదించి ఆధార్ కార్డు తో ఇకెవైసి చేయించుకోవాలి.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం

- పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - కడప

వైద్య ఆరోగ్య శాఖలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ఇక ఉద్యమమే శరణ్యమని, ఎన్ని సార్లు సమస్యల వినతిపత్రాలు ఇస్తున్నా, ఇటు అధికారులు, అటు ప్రభుత్వం లక్ష్య పెట్టడం లేదని.తక్షణమే ప్రభుత్వానికి రూల్ 73, కార్మిక చట్టం 1947, పారిశ్రామిక వివాదాల చట్టం 1926 ద్వారా ఫారం ప్రకారం ఫారం ఎల్ (సమ్మె నోటీసు) జారీచేయాలని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా, జోనల్ కార్య వర్గ సమావేశం కడప నగరంలో నబీ కోటలోని కింగ్స్ ప్యాలేస్ లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్‌రావు మాట్లాడుతూ త్వరలో సంఘం తరపున సమ్మె నోటీసు జారీచేసి నియమ నిబంధనల ప్రకారం గడువువరకు వేచి చూస్తామని తదుపరి దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. తమ సంఘం గుర్తింపును రద్దు చేయించాలని తమ వైరి సంఘాలు, ఒక అసోసియేషన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయన్నారు. ఇది కార్మిక చట్టం, కార్మిక వివాదాల చట్టం ద్వారా ప్రభుత్వమే సీక్రెట్ బేలట్ ద్వారా ఎన్నిక నిర్వహించిన సంఘం అని ఆయన పేర్కొన్నారు. దమ్ముంటే ప్రభుత్వంతో మరలా ఎన్నికలు జరిపించి అందులో పోటీ చేసి గెలవాలే గాని, దొడ్డి దారిలో సిఫారసుల ద్వారా తమ సంఘాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆహారోన్ మాట్లాడుతూ తమ సంఘాన్ని బలోపేతం చేయడం ద్వారా ఉద్యమానికి జిల్లా శ్రేణులు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. . సమావేశంలో పలు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడూ ప్రభుత్వం ఉన్నతాధికారులు సంయుక్త సమావేశాలు నిర్వహించేలా చొరవ తీసుకోవాలి అలాగే వివిధ జిల్లాల్లో సంఘ భవనాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణమే కేటాయించాలన్నారు. ఈ సమావేశం లో రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు టీ.డి.కే సాగర్, ఉపాధ్యక్షులు లక్ష్మీ నారాయణ, కడప జిల్లా అధ్యక్షులు యరపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కర్నూల్ జిల్లా అధ్యక్షులు ఎం. సి. నర్సింహులు, శ్రీనివాస మూర్తి, బోగేశ్వర పిళ్ళకి, సంపత్, వెంగళ రెడ్డి, పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జోనల్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా కార్యవర్గం జిల్లా అధ్యక్షులుగా ఎర్రపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి జిల్లా కార్యదర్శిగా ఎస్.ఎం.డి మహబూబ్ బాషా యూనియన్ జిల్లా కోశాధికారిగా జనార్దన్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులుగా సుధాకర్ బాబు , శ్రీనివాసులు నాయక్ లక్ష్మయ్య యాదవ్ జాయింట్ సెక్రటరీగా మాధవి లత కృష్ణవేణి మిగతా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నాలుగు జిల్లాల జోనల్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.జె రామసుబ్బారెడ్డి, జోనల్ కార్యదర్శిగా పి శ్రీనివాసమూర్తి, జోనల్ కోశాధికారిగా హరికృష్ణ, గౌడ్ ఉపాధ్యక్షులుగా ఎం సుధాకర్ రాజు సెక్రెటరీగా రాఘవేంద్ర రాజు మిగతా కార్యవర్గ సభ్యులను నాలుగు జిల్లాల ప్రాతిపదికన ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఆస్కార్ రావు

ప్రతిభావంతులైన బాలికలకు ఉచిత విద్య, వసతి

ప్రజాశక్తి - కడప అర్బన్

అర్హులైన నిరుపేద, తల్లిదండ్రులు లేని ప్రతిభ కలిగిన బాలికలకు విద్యా అవకాశాలను అందించేందుకు ఆర్తీహోం కడప పి.వి.సంధ్య, ప్యాట్రన్-ఇన్-చీఫ్, ఆర్తీ హోం నేతృత్వంలో విన్నూత్న కార్యక్రమం ప్రారంభించిందని నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పూర్తిచేసిన నిరాశ్రయులు, ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన బాలికలకు ఉచిత విద్య, వసతి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 10వ తరగతి పూర్తి చేసిన, ఆర్థికంగా వెనుకబడిన బాలికలు అర్హులన్నారు. ఈనెల 25న కడప ఆర్తీ హోంలో సామర్థ్య పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారికి ఉచిత విద్య, వసతి, కల్పిస్తారని, ఆసక్తిగల బాలికల తల్లిదండ్రులు 80747 17196, 8331951098, 8106123469లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సామర్థ్యాలను పెంపొందించుకోవాలి

- కెఎస్ఆర్ఎంలో ఘనంగా జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి కడప అర్బన్

'భవిష్యత్తు టెక్నాలజీ ఆధారితమైందని, విద్యార్థులు తమలోని ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంపొందించుకొని, పరిశ్రమలకు తగినవారుగా తీర్చిదిద్దుకోవాలని ఐఇఎస్ చీఫ్ ఇంజినీర్, సౌత్ సెంట్రల్ రైల్వే కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల (ఎ), జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. గౌరవ అతిథి కె. రాజేశ్వరి కరస్పాండెంట్ మాట్లాడుతూ మహిళలు సైతం టెక్నికల్ రంగాల్లో ముందుకు రావాలని పేర్కొన్నారు. ఈ ఫెస్ట్ ద్వారా వారు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశాన్ని కల్పించుకోవచ్చని తెలిపారు. . వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ కాలం లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఒక ఆయుధంగా ఉండాలని తెలిపారు. ఎం.డి.డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతు కెఎస్ఆర్ ఎం విద్యార్థులకు సాంకేతిక, సాంస్కృతిక వ్యక్తిత్వ అభివృద్ధికి అన్ని అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. విద్య కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, వాస్తవ జీవనానికి అనుగుణంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, లక్ష్మీపతి బి.వినోద్ కుమార్ రెడ్డి, ఎస్. ఆదినారాయణ రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఆకాశ వాణి, కడప,, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టీ ఎన్. ప్రసాద్, కన్వీనర్ డాక్టర్ చీపటి కుమార్ రెడ్డి, భోధన , బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డిఎ, ఐఆర్‌లను వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించి కరువు భత్యం, 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఎపిటిఎఫ్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024, జనవరి నుంచి మూడు విడతల కరువు భత్యం కేంద్రప్రభుత్వం ప్రకటించిందని రాష్ట్రప్రభుత్వం కనీసం ఒక్క డిఎ కూడా ప్రకటించలేదన్నారు. కనీసం 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించలేదని పేర్కొన్నారు. వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఉన్నతపాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలన్నారు. టీచర్ల ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. సమావే శంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, జిల్లా కౌన్సిలర్లు రామచ ంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, కొండారెడ్డి, మల్లికార్జున, రామసుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ ఎంపికల్లో ప్రతిభకే ప్రాధాన్యత

- జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్

ప్రజాశక్తి - కడప

మంచి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక కావాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ అన్నారు. ఆదివారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలోని క్రికెట్ నెట్స్ లో సీనియర్స్, అండర్ 23 జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను జిల్లా కార్యదర్శి రెడ్డి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ అభివృద్ధికి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కృషి చేస్తుందని తెలిపారు. సీనియర్స్, అండర్-23 జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలకు హాజరైన క్రీడాకారులు తమ క్రీడా ప్రతిభను మంచిగా ప్రదర్శించి జిల్లా జట్టుకు ఎంపిక కావాలని అన్నారు. జిల్లా జట్ల ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి వంద మందికి పైగా హాజరు కావడంతో విశేష స్పందన లభించిందని చెప్పారు. జిల్లా జట్ల ఎంపికలకు హాజరై బౌలింగ్, బ్యాటింగ్ లో ప్రతిభ కనబరిచిన వారిని ప్రాబబుల్స్ గా సెలక్షన్ కమిటీ సభ్యులు రాఘవేంద్రప్రసాద్, విష్ణు మోహన్ రావు, మౌనిక చేశారు. సీనియర్స్ నుండి 24 మందిని, అండర్- 23 నుండి 56 మందిని ఎంపిక చేశారు. ప్రాబబుల్స్ గా ఎంపికైన వారికి త్వరలో ప్రాబబుల్ మ్యాచులు నిర్వహించి అందులో ప్రతిభ కనబరచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసి ప్రకటిస్తామని అసోసియేషన్ కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎం సాయి పృద్వితేజ తెలిపారు.

ఎంపికల్లో బౌలింగ్ బ్యాటింగ్ ప్రదర్శిస్తున్న క్రీడాకారులు

ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీలు

వక్ఫ్ బోర్డు బిల్లును రద్దు చేయాలని ర్యాలీ

ప్రజాశక్తి - కడప

వక్ఫ్ బోర్డు బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వక్ఫ్ బోర్డు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కడపలో భారీ ర్యాలీ నిర్వహించారు. నభికోట నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రారంభమై కడప పాత బస్టాండ్, నాగరాజు పేట, సిఎస్ఐ, ఎన్‌టిఆర్ సర్కిల్ మీదుగా సెవెన్ రోడ్స్ సర్కిల్ వరకు సాగింది. టిడిపి, జనసేన, బిజెపి డౌన్‌డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. వక్ఫ్ బోర్డు బిల్లుకు టిడిపి, జనసేన మద్దత్తు ఇవ్వడం హేయమైన చర్య అని అన్నారు. బిజెపి ప్రభుత్వం కేవలం ముస్లింలను టార్గెట్ చేస్తోంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు తమ ముస్లిం మైనార్టీల ఆస్తులు అన్నారు. వక్ఫ్ బోర్డు అమెండ్మెంట్ బిల్లును రద్దు చేసేంత వరకు పోరాటాలు చేస్తాం అని ఈ సందర్భంగా జెఎసి నాయకులు హెచ్చరించారు. ర్యాలీలో భారీగా ముస్లిం మత పెద్దలు, ముస్లిం మైనార్టీలు, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

అంజాద్‌బాషాకు సన్మానం

ప్రజాశక్తి - కడప

పొలిటికల్ కమిటీ (పిఎసి) సభ్యులుగా నియమితులైన సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషాను ఆదివారం వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, దూదేకుల సంఘ నాయకులు అబ్దుల్ సుభాన్, ఓ రసూల్, సుంకేసుల బాదుల్లా, కుళ్లాయప్ప సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అజ్మతుల్లా ఖాన్, పెద్దిరెడ్డి రఘునాథరెడ్డి, రహీం, సలీం సాహెబ్, మాస్టర్ అహ్మద్ ఉన్నారు.

స్నేహం విలువ గొప్పది

ప్రజాశక్తి - కడప అర్బన్

జీవితంలో ఎవరు ఎక్కడ పుట్టిన ఎక్కడ పెరిగిన చదువుకున్న చిన్ననాటి జ్ఞాపకాలు మధురమని మున్సిపల్ హై స్కూల్ 1990-91 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వం విద్యార్థుల సమ్మేళనంలో పలువురు పేర్కొన్నారు. చిన్న నాటి జ్ఞాపకాలు మధురమని, చదివిన చదువుతో ఎక్కడెక్కడో ఉద్యోగరీత్యా పనులు చేసుకున్నప్పటికీ ఏడాదికి ఒక్కసారి స్నేహితులంతా కలిసి పండుగ వాతావరణం చేసుకోవడం సంతోషంగా విషయమన్నారు. ఆదివారం భాకరాపేటలోని రానా తోటలో పూర్వపు విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తాము ఏం చేస్తున్నాం, తమ పిల్లలు ఏమి చదువుతున్నారు అన్న మధురాస్మితులను గుర్తు చేసుకుంటూ కార్యక్రమాన్ని ముందుకు సాగించారు. చిన్నతనంలో చదువుకునే క్రమంలో వారు చేసిన అల్లర్లను, టీచర్లు కొట్టిన దెబ్బలను గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఎవరు ఎంత స్థాయిలో ఎదిగిన ఒరే పోరా అనేది ఒక స్నేహితుడిని మాత్రమే అని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ పూర్వపు విద్యార్థుల సమ్మేళనంలో అందరి ని కలిపి క్రమంలో రాజేంద్ర రాజు (ఉదయ్), రాజకీయ నాయకుడు రాణా ప్రతాప్, డాక్టర్ భాస్కర్, సుబ్బరాయుడు, నాగేంద్ర వర్మ, ప్రవీణ్, వాసు, రవి, రాజశేఖర్, ఇరగయ్య, శుభ నరసయ్య, శ్రీనివాసులు నాయుడు, సుబ్బయ్య, ప్రసాద్, గంజికుంట ప్రభాకర్, తాజుద్దీన్, గిరి, పుష్ప కుమార్, రమేష్, రాంబాబు, ఆఫ్టర్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

గురువులతో పూర్వ విద్యార్థులు

నెర్రవాడ-చియ్యపాడు గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నెర్రవాడ- చియ్యపాడు గ్రామాల మధ్యన ఉన్న అనుసంధాన గ్రావెల్ రోడ్డు అధ్వానంగా ఉంది. రెండు గ్రామాల మధ్య పంట పొలాల్లో ఉన్న రహదారి గుంతలమయంగా మారి రైతులకు ఇబ్బందికరంగా మారింది. పంట పొలాలకు ఎరువులు తరలించడం, ధాన్యాన్ని ఇంటికి తరలించడం ఈ మార్గం గుండా జరగాలి. రహదారి అధ్వానంగా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గానికి మరమ్మతులు చేపడితే చాపాడుకు నెర్రవాడ నుంచి తక్కువ సమయంలో వెళ్లే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. చియ్యపాడు, బద్రిపల్లె , నెర్రవాడ గ్రామాలకు చెందిన రైతులకు ఈ మార్గంలో పంట పొలాలు ఉన్నాయి. వరి, పసుపు, మెక్కజొన్న ,దోస వంటి పంటలు ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్నారు. ఈ రహదారికి అనుసంధానంగా తిరిగి పంట పొలాలకు వెళ్లే అడ్డ రోడ్లు రెండు ఉన్నాయి. 500 ఎకరాలకు పైగా ఈ రోడ్డు పరిధిలో పంట పొలాలున్నాయి. ఈ మార్గంలో రెండు ప్రదేశాలలో నీరు ప్రవహిస్తూ రోడ్డు అధ్వానంగా తయారైంది. మిగిలిన ప్రాంతంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు ప్రయాణించేందుకు అసౌకర్యంగా ఉంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడితే అటు రైతులకు ఇటు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

మే 4న ఉచిత వడుగులు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : మస్జిదే హిదాయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో మే 4న ఆదివారం ఉచిత వడుగులు కార్యక్రమం నిర్వహించ నున్నామని కమిటీ నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని దొండపాడు రోడ్డులో గల హిదాయ మస్జిద్‌లో వారు మాట్లాడారు. పేద ముస్లిం బాలురుకు ఉచితంగా వడుగులు నిర్వహించి వారిగా అవసరమైన వస్తువులు ఇస్తామని చెప్పారు. ఈనెల 26వ తేదీ లోపు వడుగులు చేయించుకునేందుకు పిల్లల నమోదు చేసుకోవాలన్నారు. 9866454167, 9885098827లలో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ పెద్దలు కమల్ బాషా, హాఫీజ్ జైనుల్ ఆబిదీన్, షరీఫ్, చాంద్ భాషా, హాఫీజ్ జుబేర్, పెద్ద ఇమామ్ బాషా పాల్గొన్నారు.

అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా
ఎంపీ నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా నియామకం కావడం పట్ల వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. వైసిపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సిఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి, వైసిపిజిల్లా జనరల్ సెక్రెటరీ పివి రాఘవరెడ్డి, మైదుకూరు నియోజకవర్గ వైసిపి రైతు విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి, కూనవారిపల్లె సర్పంచి భూమన సుబ్బారెడ్డి, దుంపల గట్టు సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి హర్షం వ్యక్తపరిచారు. పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా ఎంపీ అవినాష్ రెడ్డి నియమితులవడం తాము గర్వంగా భావిస్తున్నామన్నారు.

ఘనంగా దుంపలగట్టు అంకాలమ్మ తిరుణాల

ప్రజాశక్తి - ఖాజీపేట

రాయలసీమలోనే ప్రముఖ ఆలయంగా పేరుగాంచిన మండల పరిధిలోని దుంపలుగట్టు గ్రామంలో మహాకాళి అంకాలమ్మ అమ్మవారి తిరుణాల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా బాసిల్లుతున్న అంకాలమ్మ అమ్మవారికి భక్తులు చల్లను నైవేద్యంగా సమర్పించారు. బి. కొత్తపల్లి గ్రామంలో కొలువైన ఉన్న అంకాలమ్మ అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

జూనియర్ ఇంటర్ ఫలితాల్లో వెంకట చందు ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

జూనియర్ ఇంటర్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశలలో చదువుతున్న వెంకట చందు ప్రతిభ చూపారు. ఎంపిసిలో 462/470 మార్కులు సాధించారు. రోజు 10 గంటల పాటు చదివేవాడినని వెంకట చందు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

ధ్యానం పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - వేంపల్లె

ధ్యానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ధ్యాన బుద్ధ హిమాలయ యోగి బ్రహ్మశ్రీ కళాధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీ చైతన్య హై స్కూల్ ఆవరణంలో పౌర్ణమి ధ్యానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఆత్మజ్ఞానం మనిషి జీవన ప్రమాణానికి మార్గదర్శకం అనే అంశంపై చాలా స్పష్టతతో హృద్యంగా బోధన ఇచ్చారు. ధ్యానం ద్వారా ఎలా మనస్సు ప్రశాంతంగా ఉండగలదో ఆత్మ విశ్వాసం పెరిగితే జీవితమే ఎలా మారుతుందో తన అనుభవంతో క్లుప్తంగా వివరించారు. ఆత్మవిశ్వాసం పెరిగితే జీవితమే ఎలా మారుతుందో తన అనుభవంతో వివరించారు. అనంతరం బ్రహ్మశ్రీ కళాధర్ రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వేంపల్లి పిరమిడ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

సిఐని కలిసిన భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - వేంపల్లె : మండలానికి నూతనంగి విచ్చేసిన సిఐ నరసింహులను భవన నిర్మాణ కార్మికులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో కలిసి శాలువతో సత్కరించారు. అలాగే భవన నిర్మాణ కార్మికులకు ఉన్న సమస్యలను కూడా సిఐ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బాలాజీ నాగేశ్వరరావు, దస్తగిరి, బుజ్జీ, సిద్దయ్య, చలపతితో పాటు కార్మికులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బంగారు దుకాణంలో చోరీ

ప్రజాశక్తి- ఖాజీపేట

స్థానిక బస్టాండ్ కూడలి సమీపంలోని ఓ బంగారు దుకాణంలో శనివారం అర్ధరాత్రి భారీ చోరీ చోటు చేసుకుంది. దుకాణంలో అమర్చిన సిసి కెమెరాలను ధ్వంసపరిచి పెద్ద ఎత్తున సొత్తును చోరీ చేశారు. ఆదివారం ఉదయం పోలీసులు దుకాణంలోకి వెళ్లి చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీం బృందం, డాగ్ స్క్వాడ్ చే ముమ్మరంగా చర్యలు చేపట్టారు. ఈ చోరీ ఘటనలో పెద్ద ఎత్తున సొత్తు అపహరణకు గురై ఉంటుందని తెలుస్తోంది. దుకాణ దారుని ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ సాగిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మరింత సమాచారం పోలీసులు వెల్లడించాల్సి ఉంది. బస్టాండ్ కూడలికి కూత వేటు దూరంలో, పోలీస్ స్టేషన్ కు అతి సమీపంలో చోరీ జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీస్ స్టేషన్ సమీపంలోని ఇంత పెద్ద ఎత్తున చోరీ జరిగితే, ఇక శివారు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజల పరిస్థితి ఏమిటి అని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పోలీసులు రాత్రి గస్తీని ముమ్మరం చేసి దొంగతనాలు జరగకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

యంత్రాలతో కోత...పశుగ్రాసానికి కొరత

ప్రజాశక్తి-ఖాజీపేట

వ్యవసాయ రంగంలో యాంత్ర పరికరాల వినియోగం ఎక్కువ కావడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గడంతో రైతులు యంత్ర పరికరాల వైపు ఆసక్తి కనబరిస్తున్నారు. వరి పైరు సాగులో నాట్లు మొదలుకొని పంట కోత వరకు అన్ని యంత్రాల ద్వారానే జరుగుతున్నాయి. వరి నాటే యంత్రం, రసాయన మందులను పిచికారి చేసే యంత్రం, కలుపు ఏరివేత యంత్రం, వరి కోయట వంటి పనులన్ని యంత్రాల ద్వారానే కొనసాగుతున్నాయి. రైతులు యాంత్రికరణ వైపు దృష్టి సారించడం వల్ల పశుగ్రాసానికి ఇబ్బందులు తప్పడం లేదు. పాడి పరిశ్రమపై ఆధారపడే పాడి రైతులు పశువుల పశుగ్రాసానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రస్తుతం పశుగ్రాసానికి తీవ్ర డిమాండ్ ఏర్పడింది. ఒక్కో ట్రాక్టర్ ఎండు గడ్డి(పశుగ్రాసం) రూ. 12 వేలు ఉంది. పాడి రైతులు పశుగ్రాసం దొరక్క ఆందోళన చెందుతున్నారు. పాడి రైతులను దృష్టిలో ఉంచుకొని గతంలో పశు గ్రాసక్షేత్రాల ద్వారా ఉచిత, రాయితీ ధరతో గడ్డి విత్తనాలు మంజూరు చేస్తుండడంతో పశుగ్రాసానికి ఇబ్బందులు ఉండేవి కావని పశుపోషకులు అంటున్నారు. వ్యవసాయ రంగం లాభసాటిగా లేకపోవడంతో పాడి పరిశ్రమ వైపు దృష్టి సారించాలనుకుంటే వరిగడ్డికి ఎనలేని డిమాండ్ ఏర్పడిందని రైతులు

వరిని యంత్రం ద్వారా కోస్తున్న కూలీ

వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఎండు గడ్డి ట్రాక్టర్ రూ. 6 వేల ధర మాత్రమే ఉండేదని, రబీ సీజన్ వచ్చేసరికి ట్రాక్టర్ పశుగ్రాసం ధర పదివేల నుంచి 12 వేల వరకు ఉంటుందని రైతులు వాపోతున్నారు. పాడి పరిశ్రమ రైతులను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, రాయితీతో కూడిన పశుదాణ, గడి విత్తనాలు మంజూరు చేసి పాడి పరిశ్రమ రంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

బిసి, ఎస్‌సి హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లపురెడ్డి పల్లె ప్రభుత్వ బాలుర బిసి హాస్టల్‌ను ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో ఉన్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగది, పడకగది, మరుగుదొడ్లలను పరిశీలించారు. విద్యార్థులు ఆడుకునేందుకు వేసవి సెలవుల తర్వాత క్రికెట్ కిట్లను ఇస్తానన్నారు. అలాగే హాస్టల్ వార్డెన్ వెంకటరెడ్డిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత హాస్టల్లో నూతన విధానాన్ని తీసుకువచ్చి విద్యార్థులకు మంచి సౌకర్యాలను అందించడం కోసం ప్రత్యేక నిధులను కేటాయించామని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని చెప్పారు.

మానవత సేవలు అభినందనీయం

పులివెందుల రూరల్ : మానవత సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పులవెందుల మానవత స్వచ్ఛంద సంస్థ 2024-25 డైరీని ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీతోపాటు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వి. వరప్రసాద్, ఎస్ఎస్‌పిఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఎస్. శివప్రకాష్‌రెడ్డి, మానవతా డైరెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మానవత సంస్థ భవనానికి, పెన్షనర్ల భవనానికి ప్రభుత్వ స్థలాలన్ని మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్‌కు కూడా భవన నిర్మాణానికి సహకరిస్తామని తెలిపారు. అనంతరం భవన నిర్మాణానికి అవసరమయ్యే ఆర్థిక అందించే ఎస్. శివరప్రకాశ్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మానవత గౌరవ డైరెక్టర్లు, అడ్వయిజర్స్, శాశ్వత సభ్యులు, విశిష్ట దాతలు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ఒంటిపై కాలిన గాయాలు
హత్యగా భావిస్తున్న పోలీసులు
మృతదేహాన్ని పరిశీలించిన డిఎస్‌పి

మృతదేహాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి మురళీనాయక్

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని నందిపల్లె గ్రామ సమీపంలో కమలాపురం నియోజకవర్గంలోని వల్లూరు మండలం సీతోలుపల్లె పైడికాల్వకు చెందిన పంగా రామయ్య (21) అనే యవకుడు ఆదివారం అనుమానస్పదలో మృతి చెందారు. వల్లూరు మండలానికి చెందిన పంగా వీరయ్య కుమారుడు పంగా రామయ్య కూలి పనులు చేసుకొనే వాడు. కాలిన గాయాలతో మండలంలోని నందిపల్లె గ్రామ సమీపంలో ఉన్న రామకృష్ణారెడ్డి అరటి తోట వద్ద పడి ఉండడంతో అరటి తోట వద్దకు పనికి వెళ్లిన కూలీ లక్ష్మీ దేవి చూసి స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొన ఊపిరితో ఉన్న రామయ్యను వేంపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈమేరకు పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్, సిఐలు నర్సింహులు, చాంద్ బాషా ఘటన స్థలాన్ని పరిశీలించారు. అలాగే మృతుని తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ విలేకరులతో మాట్లాడుతూ.. వేంపల్లె మండలంలోని నందిపల్లె సమీపంలో రామకృష్ణారెడ్డి అరటి తోట వద్దకు పొలం పనులు చేసేందుకు లక్ష్మీదేవి వెళ్లారని చెప్పారు. అరటి తోట వద్ద కొన ఊపిరితో శరీరం కాలి పోయి 'దాహం దాహం' అంటూ కేకలు వేశాడని పేర్కొన్నారు. లక్ష్మి దేవి గమనించి రైతు రామకృష్ణారెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయనతోపాటు కొందరు గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని 'ఎవరూ నవ్వు' అని విచారించగా 'ముందు నీళ్లు ఇవ్వండి నేను మాట్లాడుతాను' అని చెప్పాడరన్నారు. నీళ్లు తాగిన తరువాత తన తండ్రి పేరు వీరయ్య అని పేరు చెప్పి ఫోన్ నంబర్ ఇచ్చాడన్నారు. వెంటనే రైతు పోలీసులకు, మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటినా పోలీసులు వెళ్లి తీవ్రంగా శరీరం కాలి ఉన్న రామయ్యను ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగిందని చెప్పారు. ఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించగా నందిపల్లె వద్ద రామయ్యపై పెట్రోల్ కాని, కిరోసిన్ వేసి కాల్చిన ఘటనట్లు కనపడలేదని చెప్పారు. వేరే ప్రాంతంలో రామయ్యను పెట్రోల్ లేదా కిరోసిన్ పోసి కాల్చి రాత్రి సమయంలో నందిపల్లె ప్రాంతానికి తీసుకొని వచ్చి పడేసినట్లు ఉందన్నారు. విచారణలో ఎక్కడ కాల్చారో తెలుస్తుందని చెప్పారు. మృతునికి ఉన్న అలవాట్లు, స్నేహితులు వంటి వివరాలను తల్లిదండ్రులను సేకరిస్తామన్నారు. రామయ్యది హత్య కేసు గానే భావిస్తున్నట్లు చెప్పారు. మృతుడు రామయ్యనే శరీరానికి నిప్పు పెట్టుకొంటే అనవాలు ఉండేవని ,అవి లేవు అన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని తెలిపారు. వల్లూరు మండలంలో సీతోలుపల్లె నుంచి విఎన్ పల్లెలో ఉన్న తన 'అక్క ఇంటికి వెళ్లుతున్నాను భోజనానికి' అని ఇంటిలో చెప్పి వెళ్లినట్లు తెలిసిందని చెప్పారు. సీతోలుపల్లె నుండి విఎన్ పల్లెకు వెళ్లలేదని చెప్పారు. తమ్ముడు కోసం అక్క కూడ తల్లిదండ్రులు ఫోన్ చేసినట్లు చెప్పారు. అన్ని కోణంలో దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొంటామని చెప్పారు.

ఆసుపత్రి వద్ద రోధిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

ఘనంగా మట్టల పండగ

ముద్దనూరు : గుడ్‌ఫ్రైడే ముందు వచ్చే ఆదివారం రోజున మట్టల పండగను అన్ని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా సంఘాలకు చెందిన చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక గీతాలు పాడుతూ మట్టలు చేత పట్టుకొని పుర వీధుల్లో తిరిగారు. సిఎస్ఐ(ఎస్‌పిజి), ఆర్‌సిఎం చర్చిల్లో రెవరెండ్ జెడి వినయ్ కుమార్,రెవరెండ్ ప్రసన్న సంతోష్ కుమార్, ఫాదర్ మరిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘస్తులు, మహిళలు,యువకులు, చిన్నారులు, సిస్టర్లు పాల్గొన్నారు. **చాపాడు :** మండల వ్యాప్తంగా ఆదివారం అన్ని గ్రామాలలోని సిఎస్ఐ చర్చిల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిఎస్ఐ చర్చి పాస్టర్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారం అని పిలుస్తారన్నారు. క్రైస్తవులు మట్టలను చేతపట్టి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కేతవరం, అల్లాడుపల్లి, చిన్న గురవలూరు, గుంతచియ్యపాడు, మడూరు, పల్లవోలు గ్రామాల్లో చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. **కడప** : ప్రజలు శాంతి సమాధానంతో జీవించాలని సిఎస్ఐ సెంట్రల్ చర్చ్ పాస్టర్ విక్టర్ రాజు పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరంలోని సి ఎస్ ఐ సెంట్రల్ చర్చ్ లో భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉమెన్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ పద్మజ విక్టర్, చర్చి సెక్రటరీ మనోహర్ బాబు, కోశాధికారి డానియల్, సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీ లో గల చర్చిలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో ప్రజల క్షేమార్థం ప్రార్థనలు చేస్తూ ప్రత్యేకంగా మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో పి.రవితేజ, శాంతిరాజు, కిరణ్, రోజా, శిరీష, రామంజినమ్మ, సుగుణమ్మ, రమణమ్మ, మీనా, అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

చాపాడు : మట్టల వేడుకల్లో మహిళలు

అశ్వవాహనంపై శ్రీకోదండరాముడు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన ఆదివారం ఆదివారం రాత్రి ఏడు గంటలకు అశ్వవాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. ఉదయం కాళీయమర్దనాలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు స్వామివారి వాహన సేవ వైభవంగా జరిగింది. భజన బృందాలు భజనలు, కోలాటాలు ఆడుతుండగా స్వామివారు పురవీధుల్లో విహరించారు. వాహనసేవ అనంతరం ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం వేడుకగా ప్రారంభమైంది. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరాములవారి ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేశారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు అశ్వ వాహనంపై స్వామివారు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, భక్తులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం : శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు సోమవారం ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు చక్రస్నానం వైభవంగా జరుగనుంది. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

రేపు పుష్పయాగం : శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో 10వ రోజు మంగళవారం సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.

రక్తదానం చేస్తున్న యువత

భారత రాజ్యాంగ ఫలాలు
ప్రతి ఒక్కరికీ అందించాలి

- జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

భారత రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికి అందించాలని జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ తెలిపారు. ఆదివారం ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా విచ్చేసిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శిచ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతని, ప్రపంచ మేధావుల్లో ఒకరు అయిన అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ప్రతి ఒక్కరు నివాళి అర్పించాలన్నారు. యువత ముందుకు వచ్చి రక్తం ఇవ్వాలని, ఈ మధ్యకాలంలో గర్భిణీలు రక్తహీనతతో ఉంటున్నారు. ఆరోగ్యమైన యువకులు ముందుకు వచ్చి రక్తం దానం చేయాలన్నారు. రక్తం ఇవ్వడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, అలాగే ఆపదలో ఉన్న వారిని రక్షించిన రక్త దాతలు అవుతారని చెప్పారు. కార్యక్రమంలో గుర్రం డేవిడ్ రాజ్, డాక్టర్ కవిత, సిఐటియు కార్యదర్శి రాఘవ భగత్ సింగ్ బ్లడ్ డొనేట్ గ్రూప్ ఓబులేసు, అక్బర్, గౌతమ్. రక్తదాన శిబిరం సిబ్బంది ప్రసాద్ రెడ్డి, పుల్లయ్య సూరజ్, సిస్టర్ కోకిల పాల్గొన్నారు.

వధువును ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే 'పుట్టా'

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక ఆంజనేయ కొట్టాల్ రోడ్డులోని జిఎ ఫంక్షన్ హాలులో ఆదివారం ఖాజీపేట పట్టణ ముస్లిం మైనారిటీ నాయకులు హబీబ్ కుటుంబ వివాహ వేడుక కార్యక్రమానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టేం శ్రీరాముల యాదవ్, భూమాయపల్లే సర్పంచ్ కొంగా ని వెంకటసుబ్బయ్య యాదవ్, ముస్లిం మైనారిటీ నాయకులు సిద్దారం ఖదిరుల్లా, కమలాపురం ఫరూక్ అహ్మద్, జలీల్ అహ్మద్, పుల్లయ్య నాయుడు, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, తుట్టే రాము యాదవ్, కృష్ణయ్య యాదవ్, కట్టుబడి రమణ, రాముడు, ఓబులు, అర్షద్ పాల్గొన్నారు. **సింహాద్రిపురం:** మండంలోని నంద్యాల పల్లెకు ఎర్ర నాగు హరినాథ్ రెడ్డి, ప్రభావతమ్మ కుమారుడు జవహర్ రెడ్డి, పుష్పలత వివాహ వేడుకలకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఆదివారం నిర్వహించిన వివాహ వేడుకలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి. సతీష్ కుమార్‌రెడ్డి, తాడపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, సింగనమల, వైసిపి నాయకులూాంబశివరెడ్డి, సినీ యాంకర్ శ్యామల, మండల నాయకులు రోహన్ నాగిరెడ్డి, వైసిపి స్టేట్ ఐటీ వింగ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర నాగు శ్రీధర్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఉపాధ్యాయులతో పూర్వపు విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- లింగాల

42 ఏళ్ల తర్వాత తాము విద్యను అభ్యసించిన పూర్వపు విద్యార్థులు అందరూ మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ హైస్కూలులో ఆదివారం కలిశారు. 1983 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు పాఠశాలలో కలిశారు. అందరు ఒకరినొకరు పలకరించుకుని పాత జ్ఞాపకాలును గుర్తుచేసుకొన్నారు. క్రమంలో బతుకు జీవనానికి విద్య బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు .అలాగే విందు అరగించారు.

74 జిఒను అమలు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా త్రిపుల్ ఐటిలో స్పోర్ట్స్ కోట విద్యార్థులకు 2శాతం రిజర్వేషన్ ఉండగా 0.5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ స్పోర్ట్స్ కోట విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిజర్వేషన్స్ కచ్చితంగా పాటించాలని తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని శిల్పారామంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం వారాంతపు కార్యక్రమంలో భాగంగా జీవనజ్యోతి పాఠశాల విద్యార్థులు చేసిన జానపద, క్లాసికల్ ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో జీవనజ్యోతి పాఠశాల ఉపాధ్యాయులు, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

శిల్పారామంలో సాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప శిల్పారామంలో సాంస్కృతిక కళావేదిక మీద వారాంతపు ఆట విడుపులో భాగంగా మిస్పా మూవీ వారి సహకారంతో నగరానికి చెందిన కిషోర్ డాన్స్ అకాడమీ వారు శాస్త్రీయ నృత్యాలు, పల్లె జానపదాలు నృత్యాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి పాటలు గోదారి గట్టుమీద రామచిలకవే, గొబ్బియాలో గొబ్బియాలు, ఇస్మార్ట్ శంకర్, గళ్ళు గళ్ళు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి ఎస్.కృష్ణ ప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధు సూదన్ బాబు పర్యవేక్షించారు.